# అతడు ... నేను ...




రాత్రి పదకొండు గంటల సమయం ...

బార్ నియోన్ లైట్లతో బయట ధగధగలాడుతున్నా, లోపల మాత్రం ఒకరి ముఖం ఒకరికి కనిపించనంత మసక మసకగా ... చలిగా, వెచ్చగా ... మత్తుగా .... వాసనగా ఉంది.

నేను చాలా అసహనంగా ఉన్నాను. నా ముందు టెబుల్‌పైన 'ఓల్డ్ మంక్' నావంక జాలిగా చూస్తున్నది ... తనుమాడమన్నట్టుగా ... నాకు ఆశగానే ఉంది. కానీ ఈ రోజు డిసెంబర్ పది. ఈ రోజుకో ప్రత్యేకత ఉంది. నా భార్య నా నుంచి విడిపోయిన రోజు మాత్రం కాదండోయ్! దానిని నేను ఏనాడో మర్చిపోయాను. మగువకన్నా మందే బెటరని కూడా ఆ రోజే నిర్ణయించుకుని ఆఫీసు అయిపోగానే, ఇదిగో, ఇక్కడకు చేరిపోతాను. 'మ'కారాలపైన మమకారం చావనివారికి ఈ 'బారో' స్వర్గం. మందు, మగువ, మాంసం ... ఇవండీ

**భమిడిపాటి గౌరీశంకర్**



'మ'కారాలంటే! అసలు విషయం చెప్పకుండా ఏదో చెబుతున్నా ననుకుంటున్నారు కదూ! అదేమీ కాదండీ బాబూ! డిసెంబర్ పదికున్న ప్రత్యేకత ఏమిటంటే, నేను, నా మిత్రులు రాజీవ్, సాగర్, చిన్నా ఉద్యోగరీత్యా విడిపోయిన రోజు. సంవత్సరానికి ఒకసారి ఈ బార్‌లో ఈ నంబర్‌గల టేబుల్ దగ్గర 'ఓల్డ్ మంక్'ని సేవిస్తూ ఉదయం వరకూ కబుర్లు చెప్పుకోవాలని మా ఒప్పందం. మేము విడిపోతున్న రోజున చేసుకున్న ఒప్పందం ... దీనిని ఏ ఒక్కరు అతిక్రమించినా వారు మిగతావారికి తలో పది వేల రూపాయల చెక్కూ పంపవలసిందే. దురదృష్టం ఏమిటంటే ఇంతవరకూ ఏ ఒక్కరూ కూడా ఈ 'రూలు'ను అతిక్రమించకపోవటం.

రాజీవ్ బొంబాయిలోనూ, సాగర్ కలకత్తాలోనూ, చిన్నా మద్రాసులోనూ, నేను ఇదిగో ... ఈ రాజధాని నగరంలోనూ సెటిల్లై దాదాపు ఆరు సంవత్సరాలు కావస్తోంది. చెప్పాను కదా ... అంతంత దూరాలలో ఉన్నా సకాలంలో వస్తూనే ఉన్నారు, ఆనందంగా గడుపుతూనే ఉన్నారు.

కానీ ఈ రోజు ఏ ఒక్కరూ రావటంలేదు. నేను మాత్రం అనుకున్న సమయానికే వచ్చాను. వాచీ చూసుకున్నాను దాదాపు పన్నెండవుతున్నది. హమ్మయ్య ... అదిగో, రాజీవ్ మాత్రం వస్తున్నాడు. చెడామడా తిట్టాలనిపిస్తున్నది.

రాజీవ్ వచ్చాడు. నా పక్క కుర్చీలో కూర్చున్నాడు.

"ఏంటీ ఆలస్యం ... ప్రారంభిద్దామా? ఏమిటాలోచన ... సారీ ... ఫ్లైట్ కొంచెం ఆలస్యం అయింది. నీకేం బాబూ, లోకల్ కాండిడేట్‌వి, ఆరుగంటలకైనా వచ్చి కూర్చోగలవు. మేం గాలిలో వచ్చినా ఆలస్యమే మరి! అవునూ, ఓల్డ్ మంకీ ఉందిగానీ, మన మిగిలిన ఓల్డ్ మంకీలు ఏవి?" ప్రశ్నలు, సమాధానాలు అన్నీ అతడే చెప్పేస్తున్నాడు.

"నేనూ అదే చూస్తున్నాను. పన్నెండు దాటింది. వారు మరి రారు. వచ్చినా సరే, అనుకున్న ప్రకారం నీకు, నాకు డబ్బు ఇవ్వవలసిందే. ఊఁ, ప్రారంభించు!" అన్నాను.

గ్లాసులు, ప్లేట్స్, ఐస్‌క్యూబ్స్‌ను సిద్ధం చేశాను. మందు మత్తుగా కడుపులోకి జారుతున్నది.

"చెప్పు, ఏంటీ విశేషాలు ... సంసారం, వ్యాపారం, ఆరోగ్యం అన్నీ ఓకే కదా! మెల్లగా ఉదయం వరకూ కబుర్లు చెప్పుకుందాం. నీకు తెలుసు కదా, నేను సన్యాసిగాణ్ణి. మీ ముగ్గురి స్నేహం చేస్తున్న సమయం, అందిస్తున్న స్నేహహస్తం కోసమే బతుకుతున్నాను. ఏదో రోజు ... తాగి తాగి .... వద్దులే ... అందమైన రాత్రిని పాడుచేయడమెందుకు?" అన్నాను.

"ఏం చెప్పమంటావు? వ్యాపారం బాగానే ఉంది. డబ్బు బాగానే వస్తున్నది కానీ ..." అర్థోక్తిగా ఆగాడు.

"చెప్పు, మనలో మనకి దాపరికాలెందుకు? అఫ్‌కోర్స్, ప్రతి ఒక్కరూ ఎంతో కొంత ప్రైవసీ కోరుకుంటారనుకో ... ముఖ్యంగా వ్యక్తిగత జీవితం గురించి ... నీ కభ్యంతరం లేకపోతే .."

"అభ్యంతరాలేముంటాయి? అయినా, అంతగా చెప్పుకోదగ్గ విషయం కాదనిపిస్తున్నది."

"కాదనిపిస్తే ... చెప్పకు!"

"కాదులే, చెబుతాను. నా భార్య సంతానం లేదని నా దగ్గర గుమాస్తాతో ... దాదాపు మూడు లక్షలతో పరారీ అయిపోయింది. లేచిపోయిందంటే బాగుంటుందేమో!"

ఒక్క క్షణం మా మధ్య మౌనం.

"డబ్బు, విలాసాలు గొప్ప గొప్ప భవంతులు, కార్లు, బాంక్ బాలెన్స్ ... ఇవేవీ ఇవ్వని ఆనందం ... ఆడదానికి సంతానం వలన కలుగుతుందనుకుంటాను. పోనీలే .... ఆ గుమాస్తాగాడైనా ఆమె సరదా తీరుస్తాడో, లేక రెడ్‌లైట్‌కు చేరుస్తాడో!" ఆగి ఒక్కసారి గ్లాసులోని ద్రవాన్ని ఎత్తి తాగేశాడు.

మనిషికి మనసు చేసే గాయం ఎంత మందు తాగితే పోతుందో చెప్పగలవారేరీ?

"సరే, ఆ గొడవ పక్కన పెడతాను, నీ కో గమ్మత్తయిన కథ చెబుతాను విను!"

నేను ఆసక్తిగా అతనివైపుకు వంగాను. బారులో ... మందుమీద ఉన్న మనిషి ఎటువంటి కథ చెబుతాడో నాకు తెలుసు. వాస్తవంలో కోల్పోయిన దానికి కాస్తంత అతిశయోక్తి జోడించి ... పసందైన బూతు కథ చెప్పటం ఆనవాయితీ. ఇందుకు రాజీవుడు అతీతుడు కాడని నా ఉద్దేశ్యం.

అతను చెప్పడం ప్రారంభించా డు.

"నా భార్య నా నుంచి దూరం అయిన తరువాత ఒకరోజు అసలే చలికాలం ... ఆపైన ఒంటరితనం ... శరీరం గోల చేస్తున్నది. దేనికోసమో నీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! బయలుదేరాను ... బొంబాయిలో డబ్బు పారేస్తే ఆడవాళ్లు .... రకరకాలవాళ్లు దొరుకుతారు. ఫామిలీ ముసుగులో ... డబ్బు ఎక్కువ తీసుకుని వచ్చిన వారున్నారు. అలా బయలుదేరాను. జేబులో డబ్బుంది. స్కూటర్‌పైన బయలుదేరాను. రోడ్డుపక్కన ... అనగా ... మనిషి కోసం కాదు, మనిషిచ్చే డబ్బుకోసం ... అది తీర్చే ఆకలి కోసం ... అన్నంకోసం ... అయినా నాకు కావలసింది ఇటువంటి వారు కాదు, ఫామిలీ టైపు మనిషి. వాళ్లయితే కాస్తంత ఆరోగ్యంగా కడుపునిండి ఉంటుంది కనుక, కొవ్వుపట్టి ఉంటారు. బ్రహ్మాండమైన పడక సుఖం ఇస్తారు. అలా వెడుతూనే ఉన్నాను. ఎవరూ కనిపించలా. విసుగేసింది. కొంపదీసి బొంబాయిలో పతివ్రతలు కానీ పెరిగిపోయారా ఏమిటి అనిపించింది. ఓ చౌరస్తాలో ఆగి ... టీ బంక్ దగ్గరకు వెళ్లాను ...

"వాతావరణం చలిగా ఉంది. రెండు చేతులు జేబులో ఉంచుకుని టీకి ఆర్డరిచ్చాను.

"ఇంతలో నాకు తెలిసిన ఓ రిక్షావాలా ... 'వస్తారా సార్!' అన్నాడు. వాడి గొంతులోని హస్కీనెస్‌ను గ్రహించలేనంత తెలివితక్కువ వ్యాపారిని కాను నేను. బొంబాయి రిక్షావాళ్లలోని గొంతు మార్పును నేను పసిగట్టగలను.

"టీ తాగకుండానే బంక్‌వాడికి డబ్బులు ఇచ్చి రిక్షా ఎక్కాను. రిక్షా బయలుదేరింది.... స్కూటర్‌తో సహా.

"రిక్షా ఓ ఇంటి ముందాగింది. స్కూటర్‌ను కిందకు దించి.... అతను ఇంటి దగ్గరకు వెళ్లాడు, తలుపు తట్టాడు. ఎవరో మధ్యవయస్సు గల ఒకామె వచ్చింది. వారిద్దరూ కొంతసేపు మాట్లాడుకున్నారు. చివరకు ఆమె లోపలకు వెళ్లిపోయింది.

"రిక్షావాలా నా దగ్గరకు వచ్చాడు.

"తెల్లవారిన వరకు ఉంటే వెయ్యి రూపాయలట. రెండు గంటల లోపల ఎంత సమయమైనా నాలుగు వందలంది. కుటుంబం మనిషి. భర్త కారు డ్రైవరుట, రాత్రికి రాడట!" అతను ఆగాడు. నాకు తెలుసు ఆ మాటలకు అర్థం.

"వెయ్యి రూపాయలకే ఆమె ఆశపడుతున్నది. కానీ నేనుమాత్రం ఏం చేయాలి ... అంగీకరించాను. వాడి కూలీ ప్లస్ కమిషన్ ఇచ్చి పంపించివేశాను.


"తలుపు తట్టాను. ఆమె వచ్చింది. ఇంటిలోపల మసక వెలుతురు ... ఆమె నడుం చుట్టూ నా చేతులు బిగుసుకున్నాయి. శరీరం బిగువుగానే ఉంది. శరీరాన్ని బాగానే కాపాడుకొస్తున్నది. మంచి పట్లు తెలిసినదానిలా ఉంది.

## ఇంద్రజ వైరుధ్యం

"ఇక్కడ నేర్పించేవాళ్లకంటే ఎగతాళి చేసేవాళ్లే ఎక్కువ. వాతావరణమంతా కృత్రిమత్వమేనని తెలుసుకోడానికి చాలాకాలం పట్టింది" అంటూ 'సొగసు చూడతరమా' సినిమాతో అందరినీ ఆకర్షించిన ఇంద్రజ అంటోంది. ప్రస్తుతం ఆమె తెలుగులో ఒకే ఒక సినిమాలో మాత్రమే నటిస్తోంది. మరల అంతలోనే "గుర్తింపును, పేరును, డబ్బును సినీపరిశ్రమే ఇచ్చింది..." అంటూ ఆత్మవిశ్వాసంతో మాట్లాడుతోంది. వేషాల్లేకపోతే, సినీ తారలు ఏంచేసినా, ఏంమాట్లాడినా వైరుధ్యంగానే ఉంటుంది.

సి.





"ఇద్దరం మంచం మీదకు చేరాం. నన్ను తమకంగా అల్లుకుపోతున్నది. నా చేతులు తన పని తాను చేసుకుపోతున్నాయి. ఇద్దరి శరీరాలు ఒకటిగా మిగలాయి.

"చీకటి ... మా మధ్యన .. మా గదిలోనూ ...

"అలసిపోయాం. అలసటతో నిద్రపోయాం.

"దాహంతో మెలకువ వచ్చింది. లేవబోయాను. చీకటిగా ఉంది. లైట్ స్విచ్ కోసం వెదికాను. దొరికింది. లైట్ వేశాను. నగ్నంగా ఆమె శరీరం ... కళ్లు నులుముకుని చూశాను ...

"నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. ఆశ్చర్యం ... బాధ .... కోపం ... కసి ... కలిసిన భావం కలిగింది.

"గబగబా బట్టలు వేసుకుని జేబులోనుంచి పర్సును తీసి దానిలో ఉన్న నోట్లను లెక్క చూడకుండానే ఆమె పక్కనుంచి, వడివడిగా బయటకు వచ్చి స్కూటర్ స్టార్ట్ చేసి బయలుదేరాను. నా వెనుక గాజుల శబ్దం వినబడినా సరే, నేను మాత్రం వెనుకకు తిరిగి చూడలేదు.

"అన్యాయం ... ఘోరమైన అన్యాయంరా ...! స్త్రీలు ఎందుకు క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటారో నాకర్థం కాదు. వెర్రి కానీ ... అర్థమైతే అది ఆడదే కాదు కదా!"

అతను ఆగాడు. సీసాలోని మరికొంత మందును గ్లాసులో ఒంపుకుని ఓ ఐస్ ముక్కను వేసుకుని ... కొంతసేపు ఆగి గడగడా తాగాడు.

"కథ బాగుంది. ట్విస్ట్ ఏమిటో చెప్పక సస్పెన్స్ ఎందుకు చెప్పు! అదేదో గబగబా చెబుదూ .. సస్పెన్స్ భరించలేకుండా ఉన్నాను. ఎందుకంత ఆశ్చర్యం వేసింది. ఎందుకు వెనకా ముందూ చూడకుండా డబ్బు ఆమె దగ్గర ఉంచి, వచ్చేశావు? కొంపదీసి ఆమె నీ మాజీ ప్రియురాలు కాదు కదా! లేక నీ సెక్రటరీయా, లేక మరింకెవరైనా ముఖ్యమైనవారా?" 'ముఖ్యమైన' అన్నదగ్గర వత్తి పలుకుతూ అన్నాను.

"...." మౌనంగా తాగటం ప్రారంభించాడు.

దాదాపు పావుగంట సమయం మామధ్య నిశ్శబ్దంగా గడిచిపోయింది. ఇద్దరం కూడా దాదాపుగా మనిషి సహాయం ఉంటే కానీ ఇంటికి చేరుకోలేని స్థితిలో ఉన్నాం.

దూరంగా గడియారం నాలుగు గంటలు కొట్టింది.

"వస్తానురా .. సమయమవుతున్నది ... ఎంత గాలిలో ప్రయాణించినా బొంబాయి చేరుకునేసరికి బోలెడంత సమయం పడుతుంది, వస్తాను!" అతను వడివడిగా బయటకు వెళ్లిపోయాడు.

అతను వెళ్తున్న దృశ్యం చూస్తుంటే అసలు వాడు మందు తాగినట్టే లేడు. బొంబాయి వెళ్లి ఎంత ఎదిగిపోయాడు!

నేను ఇంటికి ఎలా చేరుకున్నానో నాకే తెలియదు. కానీ, రాజీవ్ చెప్పిన కథలోని సస్పెన్స్ మాత్రం నన్ను వెంటాడుతూనే ఉంది. ఆమె ఎవరు? అతనెందుకు అలా ప్రవర్తించాడు? ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలియదు.

ట్రింగ్ ... ట్రింగ్.... ఎడతెరిపి లేకుండా మోగుతన్న ఫోన్‌ను చిరాకుగా ఎత్తాను.

"హలో! నేనురా, చిన్నాని! మద్రాసునుంచి. సారీరా, నిన్న రాలేకపోయాను. నీకు పదివేలు పంపుతున్నాను. సాగర్‌కు కూడా పంపుతున్నాను."

"మరి ... రాజీవ్‌కూ ..." నా మాట నాలో ఉండగానే, చిన్నా ఫోన్‌లోనే

"ఏం, నాయనా ... రాత్రి పీకలవరకు తాగిన ఓల్డ్ మంక్ హేంగోవర్ వదలలేదా ఏమిటి ...?"

"ఏం ... ఏమైంది? బాగానే ఉన్నాను, విషయం చెప్పు!" అన్నాను.

"నీకు తెలియదా ... లేక టెస్టింగా? రాజీవ్ నాలుగు రోజుల కిందట కారు ఏక్సిడెంట్‌లో చనిపోయాడు. బహుశా నీకు తెలిసే ఉంటుందని నేను నీకు ఫోన్ చేయలేదు. ఉంటాను!" ఫోన్ పెట్టేసిన శబ్దం.

ఒక్క క్షణం జరిగింది ఏమిటో నాకర్థం కాలేదు.

నిన్న రాత్రి ... నాతో దాదాపు నాలుగు గంటల సమయం ... గ...డి...పిం...ది.... ...!

నా శరీరం చల్లగా మారుతున్న సమయంలో "సార్, టెలిగ్రామ్!" అన్న కేక వినిపించింది.

గబగబా బయటకు వెళ్లి టెలిగ్రాం అందుకున్నాను. విప్పి చదివాను "సిస్టర్ ఎక్స్‌పయిర్డ్ సాగర్!" మరో షాక్!

ఏమిటీ చిక్కు ముడి?

ఎవరీ సిస్టర్? సాగర్ దగ్గరకు ఎలా చేరింది? అతడెందుకు టెలిగ్రాం ఇచ్చినట్టు ...

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాలుగు రోజుల కిందట నా కొచ్చిన ఉత్తరం సంగతి. గబగబా వెళ్లి ఆఫీసు రూములో ఉంచిన ఉత్తరం తీసి చదవసాగాను.

మిస్టరీ విడిపోతున్న భావన.

"అన్నయ్యగారికి, జీవితంలో అనేక సంఘటనలకు మన ప్రమేయం ఉండదు. వాటిని మనం ఓ ట్విస్ట్‌లుగా భావించడమే తప్ప చేయగలిగింది ఏమీ ఉండదు. కానీ, మనసు ... అంతరాత్మవంటి భావాలు మాత్రం మనిషిని శిక్షించడానికే భగవంతుడు కల్పించాడని నేను భావిస్తున్నాను.

అసలు విషయం ... మీ రాజీవ్‌ని వదిలేసి సంతానం పైన భ్రమతో అతని దగ్గర గుమాస్తాగా పనిచేసేవాడితో లేచిపోయాను. డబ్బులు అయిపోగానే అతను మామూలుగా మారిపోయాడు. ఆ తరువాత బ్రోతల్‌గా మద్రాసు చేరుకున్నాను. ఒకరోజు సాగర్‌గారు వచ్చారు ... కస్టమర్‌గా ... చిత్రంగా ఉంది కదూ ... ఈ పదం ... ఆయన నన్ను తన ఇంటికి తీసుకువెళ్లారు.

ఇక్కడొక విషయం మీకు చెప్పాలి.

నేను గుమాస్తాగాడితో లేచిపోయిన తరువాత చాలాకాలం బొంబాయి శివార్లలోని మురికివాడలో ... ఫామిలీబైపు వ్యభిచారం చేశాను. ఆ సమయంలో ఆ...యు...న.... అదే మీ స్నేహితుడు ... రా...జీ...వ్....గారు ఓ క.. స్ట..మ...ర్...గా వచ్చారు.

ఇంక రాయటానికి ఏమీ లేదు. నా జీవిత లక్ష్యం ఏమిటో తెలియనప్పుడు బతకటం వృథా!

ఉంటాను, చెల్లిని కాని చెల్లిని ..."

నాకర్థమైంది. ఉత్తరం మీది తేదీ చూశాను. దాదాపు పదిహేను రోజుల కిందటిది. అంటే ఆమె చనిపోయి? రాజీవ్ ... ఆమె దగ్గరకు నాలుగు రోజుల కిందట వెళ్లాడు.

అంటే ... వాళ్లిద్దరూ కూడా చనిపోయిన తరువాత ...

నాకేదో అవుతున్నట్టుగా ఉంది. టెలిగ్రామ్‌పైన తేదీ చూశాను. వారం రోజుల క్రితంది ... సహజ ధోరణిలో ఆలస్యంగా వచ్చింది.

హే భగవాన్...!

గాలిలో తేలుతూ ఉండే నా దగ్గర మీకు చెప్పటానికి మరేమీ లేదు ...! ■

